www.prajasakti.com

ప్రజాశక్తి

గురువారం 17 నవంబరు 2022

5

ఏలూరు

ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి - పెదపాడు

ఆక్వా రైతుల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని రాజుపేటలో గుండవనేని సురేష్ ఇంటి వద్ద ఆక్వా రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. ఫీడ్ ధరలు తగ్గించడం, రొయ్య ధర పెంచడం, విద్యుత్ సబ్సిడీ పునరుద్ధరణ వంటి చర్యలు వెంటనే చేపట్టాలని కోరారు. ఫీడ్ తయారీలో వాడే ముడి సరుకు ధరలకు అనుగుణంగా ఫీడ్ ధరలు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధునాతన యంత్రాలతో ఆక్వా ఫీడ్ మిల్లులను ఏర్పాటు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ముందుగా నిర్ణయించిన ధరలలో కోత పెట్టి ధరలు తగ్గించడం తగదన్నారు. 100 కౌంట్ రొయ్యలకు రూ 240 ధర అమలు చేయాలని కోరారు. సంఘం జిల్లా అధ్యక్షులు నిమ్మగడ్డ నర్సింహా, జిల్లా కమిటీ సభ్యులు గుండవనేని సురేష్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

కూటి కోసం వెళ్తుంటే..!

కళాకారుడిని బలిగొన్న రోడ్డు ప్రమాదం
కాకినాడ జిల్లాలో ఘటనతో ఉలిక్కిపడిన నారాయణపురం

ప్రజాశక్తి - ఉంగుటూరు

వారు కళాకారులు. జాతరలు వంటి ఉత్సవాల్లో వేషాలు వేసి అందరినీ అలరిస్తూ పొట్ట నింపుకునేవారు. అదే వృత్తిపై అనకాపల్లి బయల్దేరిన కళాకారులు కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి వద్ద బుధవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదానికి గురికావడం అందరినీ కలిచివేసింది. ఈ ప్రమాదంలో ఉంగుటూరు మండలం నారాయణపురానికి చెందిన దుబాకుల ప్రసాద్ (45) మృతి చెందడంతో ఆ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నారాయణపురానికి చెందిన దుబాకుల ప్రసాద్, దుబాకుల విజయ్ అన్నదమ్ములు. తమ్ముడు విజయ్ శక్తి, కాళికాదేవి వేషాలు వేసే ప్రోగ్రామ్‌లు ఒప్పుకుంటూ కళాకారులను తీసుకెళ్లి ప్రదర్శనలు ఇస్తుంటాడు. ఇక అన్న ప్రసాద్ కాళికాదేవి వేషం వేయడంలో అందెవేసిన చేయి. టీమ్‌లో ప్రధాన వేషం అతనిదే. ఈ క్రమంలో అనకాపల్లిలో బుధవారం ఓ జాతర కార్యక్రమంలో వేషాల ప్రదర్శనకు 12 మంది కళాకారులను తీసుకుని మంగళవారం రాత్రి తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల నుంచి టాటామేజిక్ వాహనంలో బయల్దేరారు. ఇదేవిధంగా ప్రసాద్ బావమరిది తూర్పుగోదావరి జిల్లా దొమ్మేరులో మృతి చెందగా మంగళవారం దిన కార్యక్రమానికి ప్రసాద్ దంపతులు వెళ్లారు. దీంతో ప్రసాద్ దొమ్మేరులో ఈ వ్యాన్ ఎక్కారు. కొంతదూరం ప్రయాణించి మల్లేపల్లి వద్దకు రాగానే వీరు ప్రయాణిస్తున్న వాహనం ప్రమాదానికి గురై నలుగురు మృతి చెందగా వారిలో నారాయణపురానికి చెందిన ప్రసాద్ ఉండటం అందరినీ శోకసంద్రంలో ముంచింది. ప్రసాద్ మృతదేహానికి రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం స్వగ్రామం నారాయణపురం తీసుకొచ్చారు. మృతుడు ప్రసాద్‌కు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. వేషాలు వేస్తూ మిగిలిన రోజుల్లో ఇళ్లకు రంగులు వేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్న ప్రసాద్ మరణం ఆ కుటుంబానికి తీరని లోటని స్థానికులు విచారం వ్యక్తం చేస్తున్నారు.



కుటుంబ సభ్యులతో ప్రసాద్ (ఇన్‌సెట్లో ప్రసాద్)(ఫైల్‌ఫొటో)

మాట్లాడుతున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

శనివారంలోగా దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు

జగనన్న ఇళ్ల కార్యక్రమం కింద జిల్లాలో అందిన దరఖాస్తులన్నింటినీ శనివారంలోగా ఆన్‌లైన్ చేయాలని జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశపు మందిరంలో జగనన్న ఇళ్లు, నాడు-నేడు, పారిశుధ్యం, రీసర్వే, మధ్యాహ్న భోజనం, ఓటర్ కార్డుతో ఆధార్ అనుసంధానం తదితర అంశాలపై జిల్లాస్థాయి అధికారులతో కలిసి బుధవారం మండలస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జగనన్న ఇళ్ల పథకం, 90 రోజుల్లో ఇళ్ల స్థలాలు మంజూరు కింద అందిన దరఖాస్తులను ఈ నెల 19వ తేదీ శనివారంలోగా నూరుశాతం ఆన్‌లైన్ చేయాలన్నారు. వివరాలను గృహనిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు పంపాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకూ 1.14 లక్షల మంది లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేశామని, 23 వేల మంది లబ్ధిదారులకు కోర్టు కేసులు, లబ్ధిదారుల మరణం, వలస వెళ్లడం, స్థలాలపై లబ్ధిదారుల అనాసక్తి, సమస్యాత్మక లేఅవుట్లు తదితర కారణాలతో ఇళ్ల స్థలాలు మంజూరు ఆగిందన్నారు. కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న కేసులు, సమస్యాత్మక లేఅవుట్‌లు తదితర అంశాల్లో సదరు ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ స్థలాలు అందుబాటులో ఉంటే ప్రతిపాదనలు వెంటనే పంపాలన్నారు. ఇళ్ల నిర్మాణానికి అవసరమైన నీటి సరఫరా లేని కారణంగా నిర్మాణాల్లో ప్రగతి లేదని గతంలో అధికారులు తెలియజేశారని, అటువంటి సమస్య ఉన్నచోట్ల నీటి సౌకర్యం కల్పించామని చెప్పారు. పారిశుధ్యంపై సమీక్షిస్తూ జిల్లాలోని ప్రతి మండలంలో వారానికి ఒక గ్రామంలో స్పెషల్ డ్రైవ్ మోడ్ లో సంపూర్ణ పారిశుధ్య కార్యక్రమం అమలు చేసేలా ఎంపిడిఒలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలన్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా చెత్త లేకుండా చూడాలన్నారు. గ్రామాలు, పురపాలక సంఘాల్లో తడి చెత్త నుండి నాణ్యమైన వర్మీ కంపోస్ట్ తయారీ, అమ్మకంపై ప్రత్యేకమైన చర్యలు తీసుకోవడం ద్వారా స్థానిక సంస్థలకు ఆదాయం లభిస్తుందన్నారు. దీనికోసం వ్యవసాయ శాఖలో రిటైర్డ్ అధికారిని పర్యవేక్షణ అధికారిగా నియమిస్తామని తెలిపారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పారిశుధ్యం, మధ్యాహ్న భోజనంలో పౌష్టికాహారం సరఫరా, తదితర అంశాలను పరిశీలించాలన్నారు. నాడు-నేడు కార్యక్రమంలో పనులు చేపడుతున్న పాఠశాలల్లో సిమెంట్ వంటి నిర్మాణ సామాగ్రిని తరగతి గదుల్లో నిల్వ చేయవద్దన్నారు. రీసర్వే చేపట్టిన కేటగిరి-3 గ్రామాల్లో కల్పించిన సర్వే పనులు చేపట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు, డిఆర్‌ఒ ఎవి.సత్యనారాయణమూర్తి, డిఆర్‌డిఎ పిడి విజయరాజు, డిపిఒ ఆర్‌వి.గంగాభవాని, హౌసింగ్ పిడి వేణుగోపాల్, వ్యవసాయశాఖ జెడి వై.రామకృష్ణ, పంచాయతీరాజ్ ఎస్ఇ చంద్రభాస్కర్‌రెడ్డి, డ్వామా పిడి రాంబాబు, డిఇఒ ఎన్.బాలాజీ, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ రూపస్సీరాణి, డిఎంహెచ్ఒ డాక్టర్ రవి, డిసిహెచ్ఎస్ డాక్టర్ ఎవిఆర్.మోహన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముమ్మరంగా బెయిలీ బ్రిడ్జి పనులు

రేపటి నుంచి వాహనాల రాకపోకలకు అనుమతి

ప్రజాశక్తి - భీమడోలు

ఏలూరు కాలువపై గుండుగొలను వద్ద రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న బెయిలీ బ్రిడ్జి నిర్మాణపు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. బ్రిడ్జి మీదుగా శుక్రవారం ఉదయం నుంచి రాకపోకలకు అనుమతిస్తామని రోడ్లు, భవనాల శాఖ పర్యవేక్షక ఇంజినీర్ జివి.భాస్కరరావు తెలిపారు. భీమడోలు సహాయ ఇంజనీర్ భాస్కర్‌రావు ఆధ్వర్యంలో కొనసాగుతున్న బెయిలీ వంతెన నిర్మాణపు పనులను బుధవారం ఉదయం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కిషోర్‌బాబుతో కలిసి ఆయన పరిశీలించారు. 30 మీటర్ల పొడవు, ఆరు మీటర్ల వెడల్పుతో నిర్మించే వంతెనపై ఎనిమిది టన్నుల వరకు బరువు గల తేలికపాటి వాహనాలు ప్రయాణించేందుకు అనుమతిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గుండుగొలను వద్ద ఏలూరు కాలువపై 120 సంవత్సరాల క్రితం నిర్మించిన వంతెన కొంతకాలం క్రితం కూలిపోయిన సంగతి తెలిసిందే. దీంతో రాకపోకలు నిలిచి గుండుగొలనుతోపాటు ఏలూరు రూరల్, దెందులూరు, భీమడోలు మండలాలకు చెందిన కొల్లేరు ప్రాంత గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ దశలో స్పందించిన ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబు శిథిలమైన బ్రిడ్జి స్థానంలో నూతన వంతెన నిర్మాణానికి అనుమతులు సాధించారు. ప్రజలకు ఇబ్బందుల్లేకుండా ఉండేలా తాత్కాలిక ఏర్పాట్లలో భాగంగా బెయిలీ వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టారు. దీనిపై గుండుగొలను ఉపసర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో గ్రామస్తులు సమస్యను ఎంఎల్ఎ దృష్టికి తెచ్చారు. అదే సమయంలో ఆ గ్రామస్తులు బెయిలీ వంతెన త్వరితగతిన ఏర్పాటు చేయాలని కోరుతూ సాధన కమిటీ ఆధ్వర్యాన రాయబారాలు కూడా చేశారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ పెనుగొండ వద్ద ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న బెయిలీ వంతెన సామగ్రిని గుండుగొలను వద్ద వినియోగించేందుకు అనుమతి సాధించారు. ఇదే క్రమంలో ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ కె.సుబ్బరాజు స్పందించి గుండుగొలను వద్ద బెయిలీ వంతెన ఏర్పాటు చేసే వరకూ ఆ పనుల్లో వ్యక్తిగతంగా పాల్గొని పర్యవేక్షించారు. ఎంఎల్ఎ సోదరుడు, వైసిపి నియోజకవర్గ నేత పుప్పాల కార్తీక్, ఉప సర్పంచి ముదుండి సూర్యనారాయణరాజు వంతెన నిర్మాణపు పనులను బుధవారం పర్యవేక్షించారు. కార్యక్రమంలో వైసిపి ఎస్‌సి సెల్ నేత గొటికల మురళి పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సుబ్బరాజు, కార్తీక్, సూర్యనారాయణరాజు, ప్రముఖులు

ఫోర్టిఫైడ్ రైస్‌తో ఆరోగ్య భద్రత

ఏప్రిల్ నుంచి రేషన్‌లో అవే బియ్యం పంపిణీ
రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ సిహెచ్.విజయ్‌ప్రతాప్‌రెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

ప్రభుత్వ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాల్లో మధ్యాహ్న భోజన పథకంలో పోషకాలు దట్టించిన ఫోర్టిఫైడ్ బియ్యాన్ని వినియోగించడం ద్వారా విద్యార్థులు, చిన్నారుల ఆరోగ్యానికి మరింత భద్రత లభిస్తుందనే విషయాన్ని అందరికీ అవగాహన కల్పించాలని రాష్ట్ర ఆహార కమిషన్ ఛైర్మన్ విజయ్‌ప్రతాప్‌రెడ్డి చెప్పారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో బుధవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో ఆహార భద్రతపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజులుగా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో పర్యటించి అంగన్‌వాడీ కేంద్రాలు, వసతిగృహాలు, రేషన్ దుకాణాలు, పాఠశాలలు తనిఖీ చేశామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోర్టిఫైడ్ రైస్‌ను అంగన్వాడీలకు, పాఠశాలలకు అందించడం వల్ల ఐరన్, పోలిక్ యాసిడ్, బి12 విటమిన్ అందుతాయన్నారు. దీనివల్ల వెన్నెముకకు బలం, మెదడు బాగా పని చేయడం వంటి వాటికి ఉపయోగపడుతుందని వివరించారు. దీనిపై ఎంఇఒలు సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి తద్వారా పిల్లలకు అవగాహన కల్పించాలన్నారు. బియ్యం కడిగేటప్పుడు పైకి తేలిన బియ్యమే ఫోర్టిఫైడ్ బియ్యం అని గ్రహించాలన్నారు. రాష్ట్రంలో ఫోర్టిఫైడ్ బియ్యం ప్రస్తుతం ఏడు జిల్లాల్లో అమలు చేస్తున్నారని వచ్చే ఏప్రిల్ నుంచి అన్ని జిల్లాలకు విస్తరిస్తారని చెప్పారు. ఆహార భద్రతా చట్టం పరిధిలోని లబ్ధిదారులందరికీ ఫోర్టిఫైడ్ రైస్ సరఫరా చేస్తారన్నారు. ఏలూరు జిల్లాలో 26 తనిఖీలు చేసామన్నారు. ఫోర్టిఫైడ్ రైస్‌పై క్షేత్రస్థాయిలో అవగాహన లేదని గుర్తించామన్నారు. అర్హులకు సరైన ఆహారం అందించకపోయినా, ఆహార భద్రతకు సంబంధించి సమస్యలు ఉన్నా వాట్సాప్ నెంబరు 9490551117 నెంబరుకు లేదా 155235 టోల్ ఫ్రీ నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. కిచిడీకి బదులు వెజిటబుల్ రైస్ అందించాలని ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామన్నారు. బియ్యం అక్రమ రవాణాను కట్టడి చేస్తామని, దీనికి సంబంధించి సాక్ష్యాధారాలతో పైన తెలిపిన వాట్సాప్ నెంబరుకు వివరాలు అందించాలన్నారు. జాయింట్ కలెక్టర్ పి.అరుణ్‌బాబు మాట్లాడుతూ రాష్ట్ర ఆహార కమిషన్ క్షేత్రస్థాయిలో గుర్తించిన లోటుపాట్లను సంబంధిత అదికారులు తక్షణమే సరిచేసుకోవాలన్నారు. రాష్ట్ర ఆహార కమిటీ సభ్యులు జక్కంపూడి కిరణ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత మెనూలో మార్పులు చేసి నాణ్యతా ప్రమాణాలు కలిగిన ఆహారాన్ని విద్యార్థులకు అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా ప్రతాప్‌రెడ్డిని జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు దుశ్శాలువాతో సత్కరించారు. సమావేశంలో ఆహార భద్రతా శాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.సురేష్, డిఎస్ఒ ఆర్‌ఎస్ఎస్ఎస్.రాజు, సివిల్ సప్లయిస్ డిఎం మంజుభార్గవి, డిఇఒ ఆర్‌ఎస్.గంగాభవాని, సోషల్ వెల్ఫేర్ జెడి మధుసూదనరావు, బిసి సంక్షేమాధికారి నాగరాణి, ఐసిడిఎస్ పీడీ పద్మ, డిఎంహెచ్ఒ డాక్టర్ బి.రవి, సిడిపిఒలు, సూపర్‌వైజర్లు, ఎంఇఒలు, పౌర సరఫరాల అధికారులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న విజయ్‌ప్రతాప్‌రెడ్డి

నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

మహిళలకు గరికపాటి క్షమాపణ చెప్పాలి

ఐలు ఆధ్వర్యాన న్యాయవాదుల ఆందోళన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ప్రవచనాలు చెప్పుకునే గరికపాటి నరసింహారావు మహిళలపై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ.. ఆయన వాటిని వెంటనే ఉపసంహరించుకుని మహిళలకు క్షమాపణ చెప్పాలని ఆలిండియా లాయర్స్ యూనియన్ (ఐలు) ఆధ్వర్యంలో ఏలూరు జిల్లా కోర్టులో న్యాయవాదులు బుధవారం ఆందోళన చేపట్టారు. బార్ అసోసియేషన్ వద్ద చేపట్టిన నిరసననుద్దేశించి ఐలు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షురాలు, రాష్ట్ర మహిళా కన్వీనర్ ఓరుగంటి శైలజ మాట్లాడుతూ మహిళల ప్రవర్తన, దుస్తులు కారణంగానే హత్యాచారాలు జరుగుతున్నాయనడం సరికాదన్నారు. మహిళలను కించపరిచేలా గరికపాటి చేసిన వ్యాఖ్యలు ఉపసంహరించుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తేజశ్రీ దేవి మాట్లాడగా కార్యక్రమంలో పి.విజయకుమారి, ఆర్.వాణి, కృష్ణవేణి, గంగ, దాసరి విజయ, గెద్ద విజయభాస్కర్, కట్టా సత్యనారాయణ, పుచ్చల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్వే మ్యాప్‌ను పరిశీలిస్తున్న జెసి

స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలి: జెసి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

జిల్లాలో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వే వేగవంతం చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం పరింపూడి గ్రామ పంచాయతీ పరిధిలోని బ్రహ్మల కాలనీలో డిపిఒ నిమ్మగడ్డ బాలాజీతో కలసి సర్వే తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, సచివాలయ సిబ్బందికి జెసి పలు సూచనలు చేశారు. సర్వే ద్వారా గ్రామ పంచాయతీ రికార్డుల్లో ప్రతి ఇల్లూ నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.నాగమణి, ఇఒపిఆర్‌డి జ్యోతి, సర్పంచి ముప్పిడి విజయకుమారి, గ్రామ కార్యదర్శి సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పథకాలందేలా చర్యలు : జెసి

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

గిరిజనుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతిఒక్కరికీ అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్, ఐటిడిఎ ఇన్‌ఛార్జి పిఒ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. స్థానిక ఐటిడిఎ కార్యాలయంలో బుధవారం ఐటిడిఎ ద్వారా అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు తీరును అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అరుణ్‌బాబు మాట్లాడుతూ గిరిజనుల సంక్షేమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నాయన్నారు. ఆ సంక్షేమ ఫలాలను అర్హులైన గిరిజనుడికి అందేలా అధికారులు పని చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి మంజూరైన పనులను మరింత వేగవంతం చేయాలన్నారు. గ్రామ సచివాలయాల ద్వారా ప్రజలకు నిర్ణీత సమయంలో ప్రభుత్వ సేవలు అందేలా, మనబడి నాడు-నేడు కార్యక్రమం కింద పాఠశాలల్లో చేపడుతున్న మౌలిక సదుపాయాల పనులు సకాలంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. గిరిజన పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతోపాటు, మధ్యాహ్న భోజన పథకంలో పోషక విలువలు కలిగిన ఆహారం అందించేలా అధికారులు పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో గృహనిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఇ.నరసింహారావు, గిరిజన సంక్షేమ శాఖ ఇఇ రమాదేవి, వివిధ శాఖల అధికారులు, ఐటిడిఎ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న అరుణ్‌బాబు

సచివాలయాల ద్వారా సత్వర సేవలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామాల్లో ప్రజలకు సత్వర సేవలను అందించేందుకు సిఎం జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల వాసుబాబుతో కలిసి మండలంలోని గోపాలపురం, రామచంద్రపురం, యర్రమిల్లిపాడు గ్రామాల్లో రూ.1.20 కోట్లతో నిర్మించిన పలు అభివృద్ధి పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. అనంతరం సర్పంచి తమ్మిన శ్రీనివాసరావు అధ్యక్షతన యర్రమిల్లిపాడులో బహిరంగ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నల్లమాడు సర్పంచి గౌతు రాము, గోపాలపురం సర్పంచి మద్దిపాటి నవిన్, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యులు కొరిపల్లి జయలక్ష్మి, ఎఎంసి మాజీ ఛైర్మన్ మరడ రమావతి పాల్గొన్నారు.



విలేజ్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ, ఎంఎల్ఎ

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - ముసునూరు

రైతు సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ పంటకు సిఎం జగన్ గిట్టుబాటు ధర కల్పిస్తున్నారని వైస్ ఎంపిపి కోటగిరి రాజానాయన అన్నారు. మండలంలోని వలసపల్లి గ్రామంలో రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కోనుగోలు కేంద్రాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. తహశీల్దార్ దాసరి సుధ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి రైతులకు ధాన్యం కాటా తూసే విషయంలో ఎలాంటి అపోహలు లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు మూల్పురి నాగవల్లేశ్వరరావు, లోపూడి సర్పంచి పేరం కృష్ణ, వలసపల్లి సర్పంచి చలసాపి దామోదరరావు, సొసైటీ అధ్యక్షులు, సొసైటీ సిబ్బంది, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి : పట్టణంలో ఎఎంసి వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఎంఎల్ఎ ఎలిజా బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాంబాబు, జెడ్‌పిటిసి సభ్యులు నీరజసుధాకర్, ఎఎంసి ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, సొసైటీ ఛైర్మన్ ఆత్కూరి సుబ్బారావు, అలవల బాబు, కొప్పుల నాగు, మిర్యాల దిలీప్, వెంపాకృష్ణ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రంలో అధికారులు, నేతలు

సుప్రీం ఆదేశాల పేరుతో భూముల స్వాధీనం తగదు

సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

సుప్రీంకోర్టు ఆదేశాలు అమలు చేస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వం చెరువు పోరంబోకు భూముల్లో సాగు చేసుకుంటున్న పేదలు, దళితులు భూములను స్వాధీనం చేసుకోవడాన్ని ఆపాలని సిపిఎం జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి ఒక ప్రకటన విడుదల చేశారు. గత 80 ఏళ్ల నుండి దళితులు, పేదల చెరువు గట్ల పక్కనే ఉన్న భూములను సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ భూముల్లో వరి, చెరకు, పత్తి తదితర పంటలు వేసుకుని జీవనోపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టు ఆదేశాలను అమలు చేస్తామంటూ పేదలు, దళితులు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకోవాలని పంచాయతీరాజ్ శాఖకు ఆదేశాలు జారీ చేయగా రెవెన్యూ శాఖ పేదలు, దళితులను భయభ్రాంతులకు గురి చేసి నోటీసులు ఇవ్వడం అన్యాయమని తెలిపారు. ఇప్పటికే జిల్లాలో రెవెన్యూ అధికారులు సుప్రీంకోర్టు ఆదేశాల పేరుతో పేదలు, దళితులకు నోటీసులిచ్చి 15 రోజుల్లో సమాధానం చెప్పకపోతే భూములను స్వాధీనం చేసుకుంటామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. దీనివల్ల లక్షలాది పేద, దళిత కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం పేదలు, దళితులు సాగు చేసుకుంటున్న భూములను స్వాధీనం చేసుకునే విధానాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. నిజంగా రాష్ట్ర ప్రభుత్వానికి కోర్టు ఆదేశాలను, తీర్పులను గౌరవించే ఆలోచన ఉందా అని ప్రశ్నించారు. ఇటీవల అమరావతి రైతుల ఆందోళన విషయంలో, మూడు రాజధానుల విషయంలో, ప్రతిపక్షాలపై నిర్బంధాన్ని ప్రయోగించే విషయంలో కోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి మొట్టికాయలు వేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సాగు భూములు మాత్రమే కాకుండా ఇల్లు కూడా తొలగిస్తామంటున్నారని, అలాగైతే వాళ్లంతా రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి పేదలు, దళితులకు న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో పేదలు, దళితులకు సిపిఎం అండగా ఉంటుందని, వారి తరపున పోరాటం చేస్తోందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

విభజన హామీలు అమలు చేయాలని సిపిఐ ధర్నా

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

రాష్ట్రంలో ప్రధాని నరేంద్ర మోడీ ఎన్నిసార్లు పర్యటించినా రాష్ట్ర ప్రజలకు ఎటువంటి ఉపయోగమూ లేదని సిపిఐ మండల కార్యదర్శి జమ్మి శ్రీనివాసరావు అన్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదురుగా సిపిఐ ఆధ్వర్యాన నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సిపిఐ పార్టీ పిలుపుమేరకు రాష్ట్ర విభజన హామీలు అమలు చేయాలని కోరుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. మోడీ విశాఖపట్నం పర్యటనకు వచ్చినప్పుడు విశాఖ ఉక్కును ప్రయివేటీకరించబోమని ప్రకటించకపోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు ఎస్ కె బాజీ, ఇళ్ల.నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న సిపిఐ శ్రేణులు

8 నుంచి వ్యకాస రాష్ట్ర మహాసభ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

భూమి ఉపాధి పరిరక్షణకు వ్యవసాయ కార్మిక సంఘం 29వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని బుట్టాయగూడెం మండల కమిటీ పిలుపునిచ్చింది. మండలంలోని దొరమామిడి గ్రామంలో మహాసభ కరపత్రాలను బుధవారం పంపిణీ చేశారు. అనంతరం చోడెం పోతయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తామా ముత్యాలమ్మ, మండల కార్యదర్శి ఉడతా వెంకటేష్ మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు మొదటిసారిగా డిసెంబర్ 8, 9, 10 తేదీల్లో జంగారెడ్డిగూడెంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

పాఠశాల భవనం త్వరగా పూర్తి చేయాలి : సిపిఎం

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థుల పరిస్థితి దారుణంగా ఉందని, పాఠశాల భవనం త్వరగా పూర్తి చేయాలని సిపిఎం ఏరియా కార్యదర్శి కామిశెట్టి సత్యనారాయణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు నిద్రపోయేందుకు ప్రదేశం సరిపోక ధాన్యం ఆరుపోసే ప్రదేశంలో పడుకుంటున్నారని తెలిపారు. మరుగుదొడ్ల సౌకర్యం సరిగా లేదని, పందుల సంచారం ఎక్కువైందని తెలిపారు. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని పేర్కొన్నారు.

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు

ఉపకరణాలు అందిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం, ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ ద్వారా కృత్రిమ అవయవాలు అందిస్తున్నట్లు సంస్థ సమన్వయకర్త డి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం (డిడిఆర్‌సి) ద్వారా వివిధ ప్రతిభావంతులకు బుధవారం ఉపకరణాలు అందించారు. ఈ సందర్భంగా డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటివరకు ఈ కేంద్రంలో ఉచితంగా కృత్రిమ అవయవాలను అందించినట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న యుడిఐడి కార్డుల దరఖాస్తు కోసం (డిడిఆర్‌సి) కేంద్రాన్ని సందర్శించవచ్చని చెప్పారు. వివరాలకు 08812 -249297, 7386565469 సంప్రదించాలని తెలిపారు.

జిల్లాస్థాయి పోటీలకు సిద్ధార్థ విద్యార్థులు

ప్రజాశక్తి - నూజివీడు

ఎస్‌జిఎఫ్ బాస్కెట్‌బాల్ అండర్ 19 కృష్ణాజిల్లా జట్టుకు నూజివీడు సిద్ధార్థ సంస్థ విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు తెలిపారు. విజయవాడ కెబిఎన్ కళాశాలలో నిర్వహించిన బాస్కెట్‌బాల్ అండర్ 19 ఎస్‌జిఎఫ్ కృష్ణాజిల్లా జట్టుకు నిర్వహించిన ఎంపికలో సిద్ధార్థ జూనియర్ కళాశాల నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. జూనియర్ ఇంటర్ నుంచి వి.రాహుల్, సీనియర్ ఇంటర్ నుంచి అర్జున్, షహీన్వ, వినీత్ ఎంపికయ్యారు. ఈ విద్యార్థులను సిద్ధార్థ విద్యాసంస్థల ఛైర్మన్ ఎం.వెంకటేశ్వరావు, కరస్పాండెంట్ వేరంపూడి సత్యనారాయణ, డైరెక్టర్ తోటకూర సాంబశివరావు అభినందించారు.

విద్యార్థులకు పుస్తకాలు అందజేత

ప్రజాశక్తి - ముసునూరు

సేవా దృక్పథంతో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించిన దేవినేని ప్రసాద్ అభినందనీయులని పలువురు అన్నారు. మండల కేంద్రమైన ముసునూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 459 విద్యార్థులకు బుధవారం ఆయన నోటు పుస్తకాలు అందించారు. ఈ సందర్భంగా దేవినేని ప్రసాద్‌ను ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాస్, పాఠశాల సిబ్బంది సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఇఒ, మాజీ ప్రధానోపాధ్యాయులు తోటకూర సాంబశివరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పలుచోట్ల 'గడపగడపకూ మన ప్రభుత్వం'

ప్రజాశక్తి - పెదపాడు


కొత్తముప్పర్రులో ఎంఎల్‌ఎ అబ్బయ్యచౌదరి

మండలంలోని కొత్త ముప్పర్రులో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్‌ఎ కొఠారు అబ్బయ్యచౌదరి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ఘంటా పద్మశ్రీప్రసాద్, ఎంపిపి ఐత్తుల రత్నకుమారి, పార్టీ మండల కన్వీనర్ అప్పన్నప్రసాద్, దెందులూరు మండల కన్వీనర్ కామిరెడ్డి నాని, సొసైటీ అధ్యక్షులు అక్కినేని రాజశేఖర్, ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షులు షేక్ సలీమ్ చౌదరి, ఎంపిటిసి సభ్యులు కర్రె అనిల్‌కుమార్, సర్పంచి లలితకుమారి గోవర్ధన్, ఉప సర్పంచి రవిబాబు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : పుంతరోడ్డు అభివృద్ధి చేయాలని పలువురు రైతులు ఎంఎల్ఎ తెల్లం బాలరాజును కోరారు. మండలంలోని ఎర్రంపేట గ్రామంలో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వివరాలను ప్రజలకు వివరించారు. సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

ముదినేపల్లి : ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని వైవాకలో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఝాన్సీరాణి

ప్రజాశక్తి - కలిదిండి

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కట్టా ఝాన్సీరాణి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు బి.సత్యకుమార్ తెలిపారు. ఈ నెల 15వ తేదీన గుడివాడ ఎన్‌టిఆర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ వారు నిర్వహించిన జిల్లాస్థాయి యు17 బాలికల విభాగంలో ఝాన్సీరాణి అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. రాష్ట్రస్థాయిలో ఎంపికవ్వడం తర్ఫీదు ఇచ్చిన ఫిజికల్ డైరెక్టర్ బి.కృష్ణకుమార్, మావుళ్లేశ్వరావు, విద్యార్థి ఝాన్సీరాణికి పాఠశాల సభ్యులు, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

గొప్ప చిత్రకారులు రాజారవివర్మ

ప్రజాశక్తి - మండవల్లి

భారతీయ చిత్రకళ చరిత్రలో గొప్ప చిత్రకారునిగా గుర్తింపు పొందిన ఏకైక వ్యక్తి రాజారవివర్మ అని ప్రజాసామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం 175వ జయంతిని పురస్కరించుకుని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవుళ్ల దేవతల చిత్రాలను అద్భుతంగా చిత్రీకరించింది రాజా రవివర్మేనని చెప్పారు. అనంతరం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాసిపల్లి యోనాకు నివాళి

ప్రజాశక్తి - ముదినేపల్లి

దళిత నేత, వైసిపి రాష్ట్ర ప్రచార కార్యదర్శి, ప్రగతి రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షులు దివంగత వాసిపల్లి యోనా వర్ధంతి సందర్భంగా బుధవారం స్థానిక మాలమహానాడు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రాష్ట్ర మాలమహానాడు అధ్యక్షులు డాక్టర్ షేక్ నాగభూషణం బూరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యోనా చేసిన సేవలను పలువురు దళిత నాయకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాదిగ దండోరా అధ్యక్షులు ఏసుపోగు దానియేలు, అక్కుల విజయకుమార్, మాతర, నవీన్, విజయ పాల్గొన్నారు.

వసతి గృహంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు ప్రభుత్వ బాలుర వసతి గృహంలో బుధవారం మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు దొంతంశెట్టి బసవరాజు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెవి, ముక్కు, గొంతు వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను వివరించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజా పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈకింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్కులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

అధికారులూ.. మాగోడు పట్టించుకోరా..!

నష్టపరిహారం చెల్లించకుంటే రోడ్డుపై బైఠాయిస్తాం
పొక్లెయిన్ వద్ద అంబేద్కర్ కాలనీ వాసుల నిరసన

ప్రజాశక్తి - ముదినేపల్లి

పొక్లెయిన్ వద్ద నిరసన తెలుపుతున్న నివాసితులు

గత రెండు రోజులుగా కూలీ, నాలీ మాని, తిండి, తిప్పలు, నిద్రహారాలు లేకుండా రోడ్డుపై పసి పిల్లలతో పడిగాపులు పడుతూ రోదిస్తుంటే అధికారులు మాగోడు పట్టించుకోరా అంటూ ముదినేపల్లిలోని అంబేద్కర్ కాలనీ నివాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం కాలనీ వద్ద పని చేస్తున్న పొక్లెయిన్ దగ్గర నివాసితులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు అధికారులు నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని, లేకపోతే రోడ్డు విస్తరణ పనులు అడ్డుకుంటామంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం తమకు నోటీసులు కూడా ఇవ్వకుండా ఉన్నపలంగా ఇళ్లు ఖాళీ చేయమంటే ఎలా అని వాపోయారు. పాదయాత్రలో జగన్ పేదలకు సహాయం చేస్తానన్నారు.. ఇదేనా సహాయమంటే, పేదల ఇళ్లు లాక్కోవడమా అంటూ పలువురు మహిళలు ప్రభుత్వంపై, అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదలైన తమకు న్యాయం జరిగే వరకు, నష్ట పరిహారం చెల్లించే వరకు పోరాటం చేస్తామన్నారు. కాంట్రాక్టు తరపు ప్రయివేటు సర్వేయర్లు తమపై దురుసుగా ప్రవర్తిస్తూ తమను భయందోళనలకు గురి చేస్తున్నారన్నారు. అడ్డగోలు సర్వే కారణంగా తమ బతుకుల రోడ్డునపడే పరిస్థితి వచ్చిందని, నష్టపరిహారం చెల్లించకపోతే తాము ఇళ్లు ఖాళీ చేసే ప్రసక్తే లేదన్నారు. తమకు స్థలాలు చూపించి, గృహాలు కట్టించి ఇవ్వాలని, లేకపోతే పిల్లపాపలతో రోడ్డుపై కూర్చుంటామన్నారు. అధికారులు స్పందించి పేదలైన తమకు నష్ట పరిహారం చెల్లించి న్యాయం చేయాలని, లేకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

తహశీల్దార్‌ను కలిసిన నివాసితులు

ముదినేపల్లిలో అంబేద్కర్ కాలనీ నివాసితులు బుధవారం సాయంత్రం దళిత నేత, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మగడ్డ భిక్షాలు ఆధ్వర్యంలో తహశీల్దార్ కె.శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందించారు. దీనిపై తహశీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ గురువారం నివాసితులంతా తమ వద్ద ఉన్న ఇళ్లకు సంబంధించిన ఆధార పత్రాలు తీసుకొని కార్యాలయానికి రావాలన్నారు.

కృష్ణ మృతిపై కళాకారుల సంతాపం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

సినీ నటుడు సూపర్ స్టార్ మృతికి ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ బుర్రకథ కళాకారులు సబ్బి కనకారావు ప్రగాఢ సంతాపం తెలిపారు. బుధవారం నిర్వహించిన సంతాప సభలో ప్రజానాట్యమండలి సీనియర్ బుర్రకథ కళాకారులు టివిఎస్.రాజు మాట్లాడుతూ ఎన్నో సాహసాలు చేసిన కృష్ణ డేరింగ్ అండ్ డాషింగ్ హీరోగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఆయన మృతికి పలువురు సంతాపం తెలిపారు. జంగారెడ్డిగూడెం నుంచి హైదరాబాద్‌కు అధిక సంఖ్యలో అభిమానులు తరలివెళ్లారు. పట్టణానికి చెందిన టిడిపి నాయకులు షేక్ ముస్తఫా, వైసిపి పట్టణ అధ్యక్షులు పిపిఎన్.చంద్రరావులతో పాటు అభిమానులు హైదరాబాద్‌కు వెళ్లారు.

బాలోత్సవ్‌లో కుమార్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - నూజివీడు

గుంటూరు జిల్లా నంబూరు బాలోత్సవ్‌లో నూజివీడు కుమార్ పాఠశాల విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ఏకపాత్రాభినయంలో కె.మోక్షిత, నాటికలో చరిష్మా పూజిత బృందం, తెలుగులోనే మాట్లాడదాంలో ఎన్.వర్షిణిలక్ష్మి, మట్టితో బొమ్మలు చేద్దాంలో సింధుశ్రీ, మూకాభినయంలో శ్రీ చరణ్ బృందం, కె.యశ్వంత్ బృందం, డిజిటల్ చిత్రలేఖనంలో ఎస్.సాయికిరణ్ బహుమతులు సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ పిన్నమనేని సంధ్యాలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పిన్నమనేని సంధ్యాలక్ష్మీ మాట్లాడుతూ తమ విద్యార్థులు ఒక్క చదువులోనే కాక అన్ని అంశాల్లోనూ ప్రతిభ కనపరచడం అభినందనీయమన్నారు. బాలోత్సవ్ కార్యక్రమంలో ప్రతిభ కనపరిచి బహుమతులు, ప్రశంసాపత్రాలు పొందిన బాల బాలికలను పలు ప్రజాసంఘాల నేతలు, పలువురు సామాజికవేత్తలు, విద్యావేత్తలు, ఉపాధ్యాయులు అభినందించారు.

షెడ్డు కూల్చివేత తగదు : సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు

అశోక్ నగర్ శ్మశానంలో కైలాస రథం, ఫ్రీజర్ బాక్సులు పెట్టే షెడ్డును కూల్చి వేయడం తగదని సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫ్రీజర్ బాక్సులు, కైలాస రథాలు ఉంచడానికి అశోకనగర్ శ్మశానవాటికలో ఎనిమిదేళ్ల క్రితం ఒక షెడ్డును నిర్మించారని తెలిపారు. ఆ షెడ్డును ముందస్తు సమాచారం లేకుండా మున్సిపల్ అధికారులు కూల్చడం తగదని పేర్కొన్నారు. ఉచిత ఫ్రీజర్ బాక్సులు, కైలాస రథాలను ఉంచేందుకు ఏలూరు నగర కార్పొరేషన్ అధికారులు తగిన స్థలాన్ని కేటాయించాలని కోరారు.

ఏలూరు అర్బన్ : అపూర్వమైన సేవలందిస్తున్న ఫ్లాష్ సంస్థకు సంబంధించిన షెడ్‌ను కూల్చటం సరికాదని ఏలూరు జ్యూట్ మిల్లు ఐఎన్‌టియుసి అధ్యక్షులు పులి శ్రీరాములు అన్నారు. కైలాస రథాలను పార్కు చేసుకోవటానికి, ఫీజర్ బాక్సులను బధ్రపరచటానికి ఏలూరు నగర కార్పొరేషన్ అధికారులు తగిన స్థలాన్ని కేటాయించాలని ఆయన కోరారు.

సొసైటీలో విచారణ

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని ములగలంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో మొండి బకాయిలు చెల్లించని రైతుల స్థిరాస్తులను వేలం వేయనున్నట్లు ప్రకటన ఇవ్వడంతో రైతులు స్పందనలో ఫిర్యాదు చేయగా వేలం నిలుపుదల చేసిన సంగతి తెలిసింది. దానికి సంబంధించి ప్రజాశక్తిలో కథనం వెలువడడంతో సొసైటీ ఉన్నతాధికారులు స్పందించి విచారణకు సీనియర్ అసిస్టెంట్ కె.గంగరాజును, సాయిబాబాను ఆయనకు అసిస్టెంట్‌గా నియమించింది. బుధవారం విచారణ ప్రారంభించారు. రైతులు వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. కొంతమంది రైతులు వారు తీసుకున్న రుణాలు దఫాలుగా చెల్లించడానికి అంగీకారం తెలిపినట్లు తెలిపారు. మిగతా వారి దరఖాస్తులను రైతుల వద్ద నుంచి స్వీకరించి వాటిని క్షుణ్ణంగా పరిశీలించనున్నట్లు తెలిపారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులోని బోధనాసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ సొసైటీ తలసేమియా భవనంలో 12 మంది తలసేమియా వ్యాధితో బాధపడుతున్న చిన్నారులకు రక్తమార్పిడిని నిర్వహించినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఛైర్మన్ బివి.కృష్ణారెడ్డి తెలిపారు. అనంతరం ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు.

ఎయిడెడ్ కళాశాలల సేవలు వెలకట్టలేనివి

మాణిక్యరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న షేక్ సాబ్జీ

ప్రజాశక్తి - ఏలూరు

భారతదేశ విద్యా వ్యవస్థ పురోభివృద్ధిలో ఎయిడెడ్ కళాశాలల సేవలు వెలకట్టలేనివని సెయింట్ థెరిసా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సిస్టర్ మెర్సీ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆక్టా వ్యవస్థాపకులు మాజీ ఎంఎల్‌సి ఎంజె.మాణిక్యరావు వర్ధంతి సందర్భంగా సెయింట్ థెరిసా స్వయం ప్రతిపత్తి మహిళా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో కన్వెన్షన్ ఆఫ్ ట్రెడిషనల్ కోర్సెస్ ఇంటూ రిస్ట్రక్చర్ కోర్సెస్ అంశంపై బుధవారం కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా మెర్సీ మాట్లాడుతూ ఎయిడెడ్ వ్యవస్థ ప్రశ్నార్థకంగా మారినటువంటి పరిస్థితుల్లో విద్యావ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సభాధ్యక్షులు ఆక్టా రాష్ట్ర ప్రెసిడెంట్ కొండ్రు మోహన్‌రావు మాట్లాడుతూ ఎయిడెడ్ వ్యవస్థను నిర్వీర్యం చేసే ఉద్దేశంతో చేసే పనులన్నీ విరమించుకోవాలన్నారు. ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి సభ్యులు షేక్ సాబ్జీ మాట్లాడుతూ అంకితభావంతో సమాజాభివృద్ధి కోసం కృషి చేసే ఎయిడెడ్ వ్యవస్థను నిర్వీర్యం చేసే ఆలోచనలను ప్రభుత్వం విడిచిపెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆక్టా జనరల్ సెక్రటరీ డాక్టర్ మువ్వా శ్రీనివాసరావు, మహిళ వైస్ ప్రెసిడెంట్ ఎం.జ్యోతి, అడిషనల్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాససాయి, పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ టి.పాల్‌బాబు, పబ్లికేషన్స్ సెక్రటరీ డాక్టర్ ఐ.సదాశివరెడ్డి, సెక్రటరీ పిఎన్‌వి.ప్రసాదరావు, కర్నూలు ఉస్మానియా కళాశాల అధ్యాపకులు ఎస్‌కె.మునీర్, బద్వేలు ఎస్‌పివిఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎస్.సుబ్బారాయుడు, హిందూ కళాశాల, డిఎన్‌ఆర్ కళాశాల వైఎన్. కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.

మరోమారు జగన్ పాలన వద్దు : ముద్దరబోయిన

ప్రజాశక్తి - నూజివీడు

ఒక్కసారి అంటూ గద్దెనెక్కిన జగన్ రెడ్డి మరోసారి వద్దు అనేలా పాలన సాగించారని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్‌ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. నూజివీడు పట్టణంలోని నాలుగో వార్డులో బుధవారం మన ఇంటికి మన ముద్దరబోయిన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలపై తన ముద్ర ఉండాలని ప్రతి పథకాన్ని నిలుపుదల చేసిన ఘనత జగన్ రెడ్డికే దక్కిందన్నారు. నేడు అమలవుతున్న విద్యా కానుక, ఆరోగ్యశ్రీ యంత్రసేవ, సామాజిక పింఛన్లు, ఆసరా పథకాలు ఉద్యానవన ప్రోత్సహకాలు గత ప్రభుత్వాలు అమలు పరిచినవేనని, కేవలం తన పేరుతో ప్రచారం ఉండాలనే ఉద్దేశంతోనేనని జగన్ రెడ్డి పథకాలను నిలుపుదల చేసి పేద బడుగు బలహీన వర్గాలను ఇబ్బందులకు గురి చేశారన్నారు. గత ప్రభుత్వ పథకాలు, ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న పథకాలపైన పన్నులు ప్రజలపై మోపుతున్న భారాలపైన శ్వేత పత్రం విడుదల చేసే దమ్ము రాష్ట్ర ప్రభుత్వానికి ఉందా అంటూ ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నూజివీడు పట్టణ పట్టణ ప్రధాన కార్యదర్శి పల్లి నాగరాజు, టౌన్ మాజీ అధ్యక్షులు చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సింగరాయపాలెంలో దోమల నివారణకు చర్యలు

దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న వ్యక్తి

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని సింగరాయపాలెం గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలడంతో గ్రామ సర్పంచి విమలారామరాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని గ్రామంలోని అన్ని వీధుల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రామంలో అన్ని వీధుల్లో సర్పంచి బుధవారం బ్లీచింగ్ చల్లించి, దోమల నివారణ మందును పిచికారీ చేయించారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమల ఉధృతి పెరగకుండా నివారణ చర్యలు చేపట్టారు. పారిశుధ్య పనులను దగ్గర ఉండి పర్యవేక్షించి పంచాయతీ సిబ్బందితో పనులు చేయించారు. గ్రామంలో ఎక్కడా చెత్తాచెదారం, మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు చేపడుతున్నట్లు సర్పంచి విమలారామరాజు తెలిపారు. ఇటీవల గ్రామంలో జ్వర పీడితుల సంఖ్య ఎక్కువగా పెరగడంతో వైద్య సిబ్బంది సూచనలు మేరకు ప్రజలు సీజనల్ వ్యాధులు బారిన పడకుండా పారిశుధ్య చర్యలు చేపట్టినట్లు ఆమె తెలిపారు.

గృహ నిర్మాణాల వేగవంతానికి చర్యలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు మండలంలో గృహ నిర్మాణాలను వేగవంతం చేసేందుకు గుండుగొలను లే అవుట్ గోదాము వద్ద మూడు వేల టన్నుల ఇసుకను నిల్వ చేసేందుకు చర్యలు తీసుకున్నామని గృహ నిర్మాణ సంస్థ పథక సంచాలకులు వేణుగోపాల్ తెలిపారు. బుధవారం సాయంత్రం భీమడోలు మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా పోలసానిపల్లిలోని ఒక లే అవుట్ లో వద్ద కొనసాగుతున్న గృహ నిర్మాణాల ప్రగతిని, పూళ్ల లే అవుట్ వద్ద గృహ నిర్మాణాల ప్రగతి పరిశీలించారు.

విద్యార్థులకు డిక్షనరీలు పంపిణీ

ప్రజాశక్తి - టి.నరసాపురం

విద్యార్థులు చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎస్ఐ కె.సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక గ్రంథాలయ శాఖ ఆవరణలో ప్రతిభ అవార్డు గ్రహీత కందిమళ్ల నిఖిల్ కుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సాయిసూర్య హైస్కూల్, విజన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు 120 మందికి ఎస్ఐ కె.సతీష్‌కుమార్ చేతులమీదుగా డిక్షనరీలు అందించారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ముంపు నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర సెక్రటరీ సభ్యులు కె.రంగారెడ్డి డిమాండ్ చేశారు. రౌతుగూడెంలో నిర్వాసిత కాలనీలో డివిజన్ నాయకులు కె.ముత్యాలరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో కె.రంగారెడ్డి మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన చేస్తామని చెప్పారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు



ప్రజాశక్తి - ఏలూరు

55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో శ్రీపాద శ్రీవల్లభ కూచిపూడి నాట్య నిలయం నాట్య గురు మేదరమెట్ల శిరీష శిష్య బృందం శ్రీ అక్షర, ఆర్యాహి, చిన్మయి, మానస, సుహాని, ద్యుతిశ్రీ ఎందరో మహానుభావులు, పలుకే బంగారమాయేనా, గురువాష్టకం, మన తెలుగు అనే కీర్తనలు చేసిన అద్భుత నాట్యం మంత్రముగ్ధులను చేశాయి. లయన్ విజిఆర్.కృష్ణారావు, నాట్య గురు ఎం.శిరీష మాట్లాడారు. అనంతరం ఏలూరు స్మార్ట్ సిటీ లయన్స్ క్లబ్ వారిచే విద్యార్థులకు బహుమతులు, నాట్య గురు ఎం.శిరీషను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉప గ్రంథపాలకులు నారాయణరావు, జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి నాగాస్త్ర, అక్షరం ఆర్ట్స్ అధ్యక్షులు డి.రాములు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : 55వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఏలూరు బాలల గ్రంథాలయంలో రాము సూర్యారావు ఆధ్వర్యంలో గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న డాక్టర్ ఎస్ఆర్.రంగనాథన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రామయ్య చిత్ర పటాలకు పుల మాలలు వేసి నివాళులర్పించారు.

నూజివీడు : మండలంలోని గొల్లపల్లి గ్రామం బ్రాంచ్ లైబ్రరీలో, శ్రీ అన్నె రామకృష్ణయ్య జెడ్‌పి హైస్కూల్లో బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ ఉద్యమ పాత్రపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని లైబ్రేరియన్ డొక్కు శ్రీనివాసరావు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయురాలు వి.పద్మ, లైబ్రేరియన్ టి.నారాయణ పాల్గొన్నారు.

పట్టణంలోని ఎస్ ఆర్ఆర్ బాయ్స్ హైస్కూల్ ఆవరణలోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమ చరిత్రపై విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. తొలుత అయ్యంకి వెంకట రమణయ్య, ఎస్ఆర్ రంగనాధ్, పాతూరి నాగభూషణం చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సామాజికవేత్త లయన్ పి.కృష్ణప్రసాద్, రిటైర్డ్ ఎంఇఒ గోవిందరాజు, రిటైర్డ్ ఎండోమెంట్ ఇఒ చెందక రాజా రామ్మోహన్‌రావు, టిడిపి నేత కందుల సత్యనారాయణ, ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయాధికారి బిహెచ్.శ్రీనివాసరావు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరు : పోతునూరు శాఖా గ్రంథాలయంలో రంగనాధన్, పాతూరి నాగభూషణం, అయ్యంకి వెంకట రమణయ్య చిత్రపటాలకు పోతునూరు హైస్కూల్ హెచ్ఎం రూపావతి రంగయ్య, పి.పూర్ణచంద్రరావు, ఎస్‌వికెడి నాగరాజుబాబు, ఆర్.సిద్ధార్థ పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమడోలు : భీమడోలు శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వెంకట రమణయ్య, రంగనాధన్ సంస్మరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు.

కొయ్యలగూడెం : స్థానిక శాఖ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా లైబ్రేరియన్ యు.రాముడు ఆధ్వర్యంలో గ్రంథాలయ వ్యవస్థ ఏర్పాటుకు ఉద్యమించిన మహనీయుల సంస్మరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. విద్యార్థు లకు పోటీలు నిర్వహించారు. కొయ్యలగూడెం శాఖ గ్రంథాలయ అధ్యక్ష కార్యదర్శులు అన్నవరం పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : స్థానిక శాఖ గ్రంథాలయంలో పలు పోటీలు నిర్వహించారు. ఎపిటిడబ్ల్యుఆర్ బాలికలు బుసరజుపల్లి, బుట్టాయగూడెం జెడ్‌పిహెచ్‌ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
O.S. No. 466/2019
బిట్వీన్:
శ్రీమతి కంచెర్ల మాధవి -వాది
మరియు
1. గూడూరు శ్రావణ్‌కుమార్
2. కంచెర్ల మాధవరావు -ప్రతివాదులు

పై నెంబరు గ్రంధమును వాది గారు ప్రతివాదులపై షెడ్యూలు ఆస్తికి ఓనర్‌గా డిక్లేర్ చేయమని మరియు సదరు ఆస్తిని వాది గారికి అప్పగించమని కోరుచూ దాఖలు చేసియున్నారు. దానిపై 2వ ప్రతివాది అయిన శ్రీ కంచెర్ల మాధవరావు, S/o. లేటు గంగాధరరావు, D.No. 17-60, NTR కాలనీ, వెంకటాపురం, ఏలూరు అను వారికి ఏవిధమైన ఆక్షేపణలు ఉన్న యెడల ది. 07-12-2022వ తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

సం/- అంబుల వెంకటనారాయణ
న్యాయవాది, పత్తేబాద
ఏలూరు ఏలూరు
తేది:16-11-2022 సెల్: 9848422155

మహారాజశ్రీ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి, ఏలూరు వారి కోర్టులో
I.A. No. 462/2019 in O.S. No. 466/2019
బిట్వీన్:
శ్రీమతి కంచెర్ల మాధవి -పిటీషనరు/వాది
మరియు
1. గూడూరు శ్రావణ్‌కుమార్
2. కంచెర్ల మాధవరావు
-రెస్పాండెంట్లు/ ప్రతివాదులు

పై నెంబరు గ్రంధమును పిటీషనరు/ వాది గారు రెస్పాండెంట్లు/ ప్రతివాదులపై ఇంజక్షన్ ఆర్డరు ఇప్పించమని దాఖలు చేసియున్నారు. దానిపై రెండవ రెస్పాండెంటు అయిన శ్రీ కంచెర్ల మాధవరావు, S/o. లేటు గంగాధరరావు, D.No. 17-60, NTR కాలనీ, వెంకటాపురం, ఏలూరు అను వారికి ఏవిధమైన అభ్యంతరములు ఉన్న యెడల ది. 07-12-2022వ తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు పై కోర్టు వారి ఎదుట స్వయముగా గాని, న్యాయవాది ద్వారా గాని హాజరై ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని ఎడల మీకు పరోక్షముగా తీర్మానించబడును.

సం/- అంబుల వెంకటనారాయణ
న్యాయవాది, పత్తేబాద
ఏలూరు ఏలూరు
తేది:16-11-2022 సెల్: 9848422155

మహారాజశ్రీ ప్రిన్సిపల్ జిల్లా కోర్టు, ఏలూరు
Tr. O.P. 18/2021
Between:
Nerella Venkata Koteswara Rao ...*Petitioner*
AND
Nerella Venkata Koteswara Rao & Others ...*Respondents*

పై నెంబరు పిటిషన్‌లో 5వ రెస్పాండెంట్ అయిన Parachuri Padmavathi, W/o. Ranga Mohan Babu, D.No. 18-9-95, Siddi Vinayaka Home Needs, Near Brahmayya Hospital, Bheemeswara Swamy Temple Road, Bhimavaram అనువారు ఎన్ని పర్యాయములు నోటీసు పంపిన పుచ్చుకొననందున ఈ పేపరు ప్రకటన ద్వారా Substitute Service ద్వారా నోటీసు ఆర్డరు వేయిచూ వాయిదా 02-12-2022వ తేదీకి వేసినారు. వాయిదా రోజు ఉదయం 10.30 ని||లకు స్వయంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరయి తగు సంజాయిషీ యివ్వవలెను. లేనియెడల పరోక్షమున తీర్మానించబడును.

D.S.V.MANIKYALA RAO
Advocate, Eluru
Cell: 9440111466

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Ground & First Floors, Sri Narayana Bhawan,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020
सत्यमेव जयते
O.A.No. 196 OF 2021
Between
The Karur Vysya Bank Ltd, Rep by its Branch Manager
Gannavaram Branch, Krishna District of A.P ... **APPLICANT BANK**
And
1. Kolapala Prudhvi, S/o Ranga Rao, Door No 8-195, Raitupata Nanadigama 521 185, Krishna District.
2.Battula Raj Kumar, S/o Kondaiah, House No13-69, Vidyanagar Gavaravaram, Senivarapupet, Eluru 534003, West Godavari District.
...DEFENDANTS
SUMMONS
Whereas the Applicant Bank had instituted an application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act, 1993 against you for the recovery of amount as mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file your written statement before this Tribunal at **10.30 am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **09-12-2022** to answer the claim.
If you intend to file any documents, you may file the same with a list along with the written statements.
You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed.
Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this the 9th day of November, 2022
Signature of the Officer
Authorized to issue summons

BEFORE THE HONOURABLE DEBTS RECOVERY TRIBUNAL AT VISAKHAPATNAM
Ground & First Floors, Sri Narayana Bhawan,
Sai Baba Street, Dabagardens, Visakhapatnam-530020
सत्यमेव जयते
O.A.No. 197 OF 2021
Between
The Karur Vysya Bank Ltd, Rep by its Branch Manager
Gannavaram Branch, Krishna District of A.P ... **APPLICANT**
And
1.Bochela Venkateswara Rao, S/o Satyanarayana Murthy, Door No 35-22-12, Bank Colony, Ward No 30, Tanuku- 534211, West Godavari District.
2.Tatapudi Koteswara Rao, S/o Sanyasa Rao, Door No 16B-10-18/ 1, 29th Division, Near Old Ramalayam, Lankapeta, Eluru 534005, West Godavari District.
3.Bochela Nageswara Rao, S/o Venkateswara Rao, Door No 1, Library Street, Bank Colony, Tanuku 534211, West Godavari District... **DEFENDANTS**
SUMMONS
Whereas the Applicant Bank had instituted an application under Section 19 of the Recovery of Debts due to Banks and Financial Institutions Act, 1993 against you for the recovery of amount as mentioned therein together with current and future interest and other reliefs. You are hereby summoned to appear and file your written statement before this Tribunal at **10.30 am** or at such time immediately thereafter according to the convenience of Tribunal on **09-12-2022** to answer the claim.
If you intend to file any documents, you may file the same with a list along with the written statements.
You should file your registered address and a memo of appearance when you enter appearance before the Tribunal either in person or by a Pleader/Advocate duly instructed.
Take notice that in default of your appearance on the day mentioned herein before, the proceeding will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this the 9th day of November, 2022
Signature of the Officer
Authorized to issue summons